International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.9, Issue-8, August, 2022
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# సామాజిక దృక్పథాన్ని ప్రతిబింబించిన కందుకూరి 'నీతిదీపిక'

డా. పొట్లూరి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి,
ఏలూరుజిల్లా – 534460
చరవాణి: 9390883982
మెయిల్: johnveslyp@gmail.com

**కందుకూరి:**

**'అలరు వీరేశలింగ మహర్షి యొకడె**
**ప్రస్తుతాంధ్రోయమునకు బ్రహ్మయగుచు' – రాయప్రోలు సుబ్బారావు**

తెలుగుసాహిత్య వికాసం కోసం, తెలుగుసమాజ అభ్యుదయం కోసం సాహిత్యాన్ని ఆయుధంగా వాడి సాహిత్య విప్లవానికి పునాదులేసిన రుషి కందుకూరి. మొదటి వచన ప్రబంధం రాసినా, మొదటి నాటకాన్ని తెనిగించినా, మొదటి ప్రహసనం రాసినా అన్నిట్లోనూ స్త్రీ అభ్యున్నతిని, సంఘసంస్కరణను ప్రోత్సహించాడు. సాహిత్యాన్ని వ్యక్తిమార్పుకు, సంఘ చైతన్యానికి సాధనంగా వాడుకున్నాడు. ఎన్ని బెదిరింపులు వచ్చినా భయపడకుండా తాను నమ్మిన సిద్ధాంతాల్ని ప్రచారం చేయడంలో వెనుకంజ వేయలేదు. లోతైన వివేచన, అంతులేని సాహసం, అమితమైన కార్యదీక్షతో సారస్వత క్షేత్రంలో నూతన వెలుగులు నింపడానికి జీవితకాలం అహరహం శ్రమించారు.

సాహిత్య ప్రక్రియ యేదైనా దానిని అభ్యుదయానికి దిక్సూచీలాగా మలిచాడు. బాల్యవివాహాలను ఖండించాడు. ఎన్నో ప్రహసనాలను రచించి బాల్యవివాహాల పట్ల విముఖత కలిగించాడు. శుభంశుభం తెలియని చిన్నపిల్లలను వయసులో పెద్దవాళ్లకిచ్చి వివాహం చేయడం శోచనీయమని తన రచనల ద్వారా ఖండించాడు. భాషలో నవీనపంథాను కోరుకున్నాడు. సంప్రదాయ సంకెళ్లను తెంచుకుని చదువరులందరికీ సాహిత్యం అందుబాటులో వుండేలా ప్రయత్నించాడు. స్త్రీలు అభివృద్ధి పథంవైపు పయనించినపుడే సంఘం అభివృద్ధి చెందుతుందని భావించాడు. అందుకే స్త్రీ పక్షపాతిగా అనేక రచనలు చేసి ఆధునిక ఆలోచనలకు పునాదివేశాడు.

వివేకవర్ధిని మాసపత్రికను స్థాపించి సమాజంలోని అనేక సాంఘికదురాచారాలను, అవినీతి, మూఢనమ్మకాలను ఖండించడం ద్వారా ప్రజల్లో పత్రికాస్థాపన పట్ల అవగాహన కల్పించారు. స్త్రీవిద్యకు ప్రాచీన సాహిత్యంలో నిషేధం లేదని చెప్పి, ప్రాచీనకాలంలోని స్త్రీలు చదువుకున్న ఉదాహరణలను అనేక గ్రంథాలనుండి ఉదాహరిస్తూ స్త్రీ విద్యను ప్రోత్సహిం చారు. 'హాస్యసంజీవని' అనే మరో పత్రికను స్థాపించి ఎన్నో ప్రహసనాలను ప్రచురించాడు. వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా సంఘ ప్రయోజనాలకు పత్రికను వాడిన సంస్కరణవాది కందుకూరి. బ్రహ్మసమాజాన్ని స్థాపించి కులవిధా నాలు, కట్నకానుకలు రూపుమాపడం, స్త్రీ విమోచనం కొరకు పాటుపడడం, వితంతువులకు పునర్వివాహాలు చేయడం, సతీసహగమనం వంటి దురాచారాలను నిర్మూలించడానికి పాటుపడ్డాడు.

**కందుకూరి – నీతిదీపిక:**

'నేటి బాలలే రేపటి పౌరులు' అనే ఆర్యోక్తిని నీతిదీపిక రచన ద్వారా మరింత వ్యాప్తిలోకి తెచ్చాడు కందుకూరి.

విద్యార్థినీ విద్యార్థుల బాల్యం, నడవడిక, మంచి లక్షణాలను అలవాటు చేసుకోవడం, పెద్దలను గౌరవించడం, తల్లిదండ్రుల ప్రాధాన్యాన్ని గుర్తించి వారిని గౌరవించడం అనే విషయాలను పొందుపరుస్తూ ఆటవెలది తేటగీతులలో రాసిన పద్యాలుగా నీతిదీపిక మనకు కనిపిస్తుంది. వీటిని చదవడం వల్ల బాలబాలికలు తమ వ్యక్తిగత లోపాలను సరిదిద్దుకుని, మంచి వ్యక్తి త్వాన్ని పెంపొందించుకోగలుగుతారు. కందుకూరి నీతిదీపిక రెండు గ్రంథాలుగా కనిపిస్తుంది.

1. నీతిదీపిక – పాఠశాల బాలురకోసం రాసిన పద్యాలు
2. స్త్రీ నీతిదీపిక – పాఠశాల బాలికల కోసం రాసిన పద్యాలు

**1. నీతిదీపిక:**

దక్షిణదేశ విద్యాసాగరుడిగా, బహుముఖ ప్రజ్ఞశాలిగా పేరుపొందిన వీరేశలింగం ఈ నీతిదీపికను 'పాఠశాలల యందు చదువు దిగువతరగతి బాలుర తెలివి కొరకు నీతిదీపికయను నూఱుగీతములను' రచించినట్లుగా చెప్పుకున్నాడు. ఇందులో మంచిబాలుడు, విద్య, అడకువ, గర్వము, ధైర్యము, శరీరారోగ్యము, స్వతంత్రజీవనము, ముఖస్తుతి, పరోపకారము, వివిధ ధర్మములు అనే శీర్షికలు మనకు కనిపిస్తాయి. నీతిదీపికలోని కొన్ని నీతుల్ని చూద్దాం.

ఉదయాన్నే నిద్రలేవడం అనేది ఏ వయసువారికైనా ఆరోగ్యకరమే. పిల్లల్లో ఉదయాన్నే నిద్రలేవడం వారి భవిష్య త్తుకు మంచిమార్గాన్ని ఏర్పరుస్తుంది. అందుకే పొద్దుపొడవకుండా నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని తోటి పిల్లలతో కలిసి పాఠశాలకు వెళ్లి చదువుకోవాలని చెప్తాడు. అంతేకాక, అల్లరిచిల్లరిగా తిరగడం, లేని వస్తువులు కావాలని పేచీపెట్టడం, పుస్తకాలను చింపుకోవడం అనేవి మంచిబాలుర లక్షణాలు కావని ఉద్బోధిస్తాడు. పాఠశాలకు సెలవు వస్తే మిగతా పిల్లలతో కలిసి ఆటలాడకుండా అంతకుముందు పాఠాలను వల్లెవేసుకోవాలని సూచిస్తాడు. చెడుస్నేహాలకు, చెడు స్నేహితులకు దూరముండడం మంచిదనే బోధ ఈ క్రింది పద్యంలో కనిపిస్తుంది.

**'చెడ్డ బిడ్డలతో చెల్మి చేయబోకు / తల్లిదండ్రుల మాటలు దాటకుండు**
**గురుని దైవంబుగా నెంచి కొలువుసేయు / జూడ మనసైన, అల్లరి జాడ జనదు'**

తల్లిదండ్రుల మాట జవదాటకుండా, వారు చెప్పిన మాటలు వింటూ మంచిబాటలో నడవాలనీ, గురువును దైవంతో సమానంగా భావించి పూజించాలనీ, పొరపాటున కూడా చెడ్డవాళ్లతో స్నేహం చేయకూడదనీ, అల్లరిపనులకు వెళ్లకూడదనీ హితవు పలుకుతున్నాడు కందుకూరి.

వ్యక్తికి వ్యక్తిత్వాన్నిచ్చేది చదువు. చదువువల్ల సంస్కారం అలవడుతుంది. ఎవరితో ఎలా ప్రవర్తించాలో తెలుస్తుంది 'విద్యలేనివాడు వింతపశువు' అన్నట్లుగా మానవాళికి విద్యలేకపోతే జీవితం అంధకారమవుతుంది. అందుకే చిన్నపిల్లలు చదువును నిర్లక్ష్యం చేయకుండా ఏ రోజు చెప్పిన పాఠాలను ఆరోజు చదువుకున్జ్ఞానాన్ని పొందాలని చెప్తున్నాడు కవి. మనదగ్గరున్న ధనాన్ని దానంచేస్తే కొంతకాలానికి తరిగిపోతుంది. కానీ విద్యను దానంచేస్తే పెరుగుతుందే గాని తరగదు. అందుకే 'అన్ని దానాలలోకి విద్యాదానం మిన్న' అన్నారు పెద్దలు. కనుకనే బాలురు చదువుకునేటప్పుడు ఏవైనా సందేహాలు వస్తే మొహమాటపడకుండా గురువుల దగ్గర వాటిని నివృత్తి చేసుకోవాలని బోధిస్తున్నాడు. చదువుకున్న వ్యక్తి ఎక్కడికి వెళ్లినా ఎలా గౌరవించబడతాడో ఈ క్రింది

పద్యంలో చెప్తాడు కవి.

**'రాజు తన దేశముననె గౌరవము గాంచు / పండితుండొ, యెల్లయెడ గారవమ్ము వడయు**
**చదువునకు రాజ్యమైనను చాలదనగ / విద్యతో సాటి మరియేది విశ్వమునకు'**

'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అన్నట్లు పండితుడు ఎక్కడికి వెళ్లినా గౌరవించబడతాడు. అటువంటి పాండిత్యం చదువువల్ల వస్తుంది. కనుకనే చదువుతో సాటివచ్చేది ఈ విశ్వంలో ఏదీలేదు కనుక చదువును నిర్లక్ష్యం చేయకూడదు. చదువు వినయవిధేయతలను ఇస్తుంది. మంచిగుణాలను బహుమతిగా ఇస్తుంది. వ్యక్తులతో ఎలా మెలగాలో నేర్పుతుంది. చదువుకు వినయము, అణకువ కలిస్తే బంగారానికి తావి అబ్బినట్లుగా వుంటుంది.

**'అడగిమడగియుండు నాతని గుణములు / కొలదివైన మిగుల గొప్పవగును**
**విఱ్ఱవీగుచుండు వీఱిడి గుణములు / గొప్పవైన మిగుల కొలదివగును'**

వినయవంతునికి మంచిగుణాలు మిక్కిలి అణకువను నేర్పుతాయి. ఎవరిపట్లా అమర్యాదగా ప్రవర్తించకూడదు. పెద్దచిన్నా తేడాలేకుండా అందరి ఎడలా గర్వపడుతూ వుంటే గొప్పలక్షణాలున్న వ్యక్తులు కూడా అవలక్షణాలున్న వ్యక్తు లుగా కనబడతారు. గర్వంవల్ల తనను మించినవారు లేరనే అహంభావం వస్తుంది. కనుక బాలురు చిన్ననాటనే ఇటువంటి మంచి గుణాలను అలవాటు చేసుకోవాలి. గర్వానికి దూరంగా వుండాలి. చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలి. దురలవాట్లకు దూరంగా వుండడం అలవాటు చేసుకోవాలి. సుగుణాలను తరగని సంపదలుగా మలచుకోవాలి. కలిగిన దానితో తృప్తిచెందాలి. అబద్ధాలు చెప్పడం మంచిదికాదు. అబద్ధాలవల్ల తల్లితండ్రి కోపిస్తారు, దండిస్తారు. తోడిపిల్లలు కూడా దూషిస్తారు. ఆపదలు వచ్చినపుడు ధైర్యాన్ని విడవకూడదు. న్యాయమార్గంలో కష్టపడి సంపాదించాలి. తన అవసరాలు తీరిన తర్వాత ఉన్నదానిలో కుంటివారికి, గ్రుడ్డివారికి, పాటుపడే శక్తిలేనివారికి దానంచేయాలి. ఈ విధంగా నీతిదీపికలో చిన్ననాటినుండే పిల్లలు అలవాటుచేసుకోవలసిన మంచి విషయాలు కనిపిస్తాయి.

**2. స్త్రీ నీతిదీపిక:**

1950లో రాజమండ్రిలోని హితకారిణి సమాజం ప్రచురించిన కందుకూరి రచన స్త్రీ నీతిదీపిక. 'బాలికా పాఠశాలల చిన్నతరగతులందున్న కన్నియలకు స్త్రీ నీతిదీపిక కందుకూరి వీరేశలింగం రచించె'నని చెప్పుకున్నారు. తెలిసీ తెలియని వయసులోనే బాలవితంతువులుగా మారిన చిన్నపిల్లల అగచాట్లను ప్రత్యక్షంగా చూసి చలించిపోయాడు కందు కూరి. చిన్ననాటినుండే బాలికలు నేర్చుకోవలసిన నీతిసూత్రాలను ఇందులో పొందుపర్చాడు. స్త్రీ నీతిదీపికలో దైవభక్తి, బంధుప్రీతి, గురుభక్తి, సత్యము, సత్సహవాసము, విద్య, పతిభక్తి, మితవ్యయము, సుగుణములు, త్యాగము, చౌర్యము, అహింస, కోపము, శరీరారోగ్యము, శాంతము, ధైర్యము, గర్వము, చాడి, పరోపకారము, బాలశిక్షణము, సమబుద్ధి, వివిధ ధర్మములు అనే పేరుతో ఉపశీర్షికలు కనిపిస్తాయి.

'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనే నానుడిని తుడిపేస్తూ స్త్రీ విద్యకు, స్త్రీ స్వాతంత్ర్యానికి, స్త్రీ వితంతు పునర్వివాహానికి త్రికరణశుద్ధిగా పాటుపడిన సంస్కర్త కందుకూరి. స్త్రీ తనను తాను సంస్కరించుకున్నప్పుడే కుటుంబమైనా, సమాజమైనా అభివృద్ధిపథంలో నడుస్తుందని నమ్మిన ఆదర్శవాది వీరేశలింగం. స్త్రీ తనజీవితంలో పాటించవలసిన నీతులన్నిటినీ ఇందులో పొందుపర్చాడు. స్త్రీతనను తాను రక్షించుకోవడానికి భక్తిమార్గాన్ని అవలంబించి మనసును నిర్మలంగా

వుంచు కోవాలని సూచించాడు. దైవధ్యాన ప్రాధాన్యాన్ని ఈ క్రింది పద్యంలో చెప్తున్నాడు.

**'ప్రతిదినంబును నిక్కంపుభక్తితోడ / మూడువేళలయందును ముఖ్యముగను**
**చెలువరో! పెక్కుమేళ్లను జేసినట్టి యీశ్వరుని వేడుకొమ్ము నీ హృదయమందు'**

జీవితంలో అనేకమేళ్లను చేస్తున్న భగవంతుని తప్పకుండా తమ జీవితంలో ప్రాధాన్యమివ్వాలని చెప్తున్నాడు. ప్రతీదినం నిద్రలేచిన వెంటనే, మళ్లీ రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు తప్పనిసరిగా ధ్యానంచేయాలని చెప్తున్నాడు.

స్త్రీ జీవితంలో వివాహం అనేది ఎంతో ప్రాధన్యమున్న అంశం. పుట్టిపెరిగిన వారిని విడిచిపెట్టి మరో కొత్త లోకం లోకి స్త్రీ ప్రవేశిస్తుంది. వాతావరణం కొత్త, వ్యక్తులు కొత్త. కనుక ఇంట్లోని అత్తామామల్ని ఆడుబిడ్డల్ని వారి మనసు నొచ్చు కోకుండా సేవలుచేయాలని సూచిస్తాడు కందుకూరి. 'నడుచుచుండవలయు కడునడంకువతోడ' అంటూ అత్తింటి వారితో క్రమంగా, మర్యాదగా నడుచుకుని వారి ప్రేమను పొందాలని చెప్తాడు.

స్త్రీ ఇంటికి దీపం. 'ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు' అని ఆర్యోక్తి. స్త్రీ చదువుకుంటే ఇంట్లోని విషయాలన్నీ ఒకరి మీద ఆధారపడకుండా చూసుకోగలుగుతుందని ఆశిస్తాడు. చదువులేని మూరు?రాలిని వివాహం చేసుకుని సంసారం చేయడం కంటే ఊరు విడిచిపెట్టి వనవాసం వెళ్లడం మంచిదని తెల్పుతాడు. చదువువల్ల వినయం, దానితోపాటు సర్వ గుణాలు అబ్బుతాయని కనుక స్త్రీ చదువుకోవడం అవసరమని స్త్రీ విద్యకు తోడ్పడ్డాడు.

స్త్రీ ఇంట్లోనూ, సమాజంలోనూ అనేక బాధ్యతలు నిర్వర్తిస్తుంది. ఈ క్రమంలో సమాజంలోని అనేకమందితో పరిచయాలు కలుగుతాయి. అయితే తాను స్నేహంచేసే వారిలో మంచివారిని ఎంపికచేసుకోవాలని ముఖ్యంగా 'జారిణుల తోనూ, సరిగానివారితోనూ, తార్చువారితోనూ, దుర్గుణాలున్నవారితోనూ' ఎట్టిపరిస్థితుల్లోనూ మగువలు స్నేహం చేయ రాదని చెప్తాడు. ఎప్పుడైనా తప్పుచేస్తే దానిని ఒప్పుకుని విడిచిపెట్టాలి కానీ ఆ తప్పును కొనసాగించకూడదు. ఆ తప్పును కప్పిపుచ్చుకోవడానికి అబద్ధాలు చెప్పకూడదు. అలా కాకుండా 'తప్పు దాచంగ బొంకితేని కానిపను లొక్కటికి రెండౌను' అని ఒక తప్పును దాచడానికి ఒకటికంటే ఎక్కువ అబద్ధాలు చెప్పాల్సి వస్తుందని హితవు చెప్తాడు.

స్త్రీకి వివాహం ఎంత ముఖ్యమో తన పాతివ్రత్యాన్ని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని హితవు చెప్తాడు కందుకూరి. 'ధర్మములలోన ఉత్తమ ధర్మమరయ మగువకు పతివ్రతా ధర్మమగును జూవె' అంటూ అవనిలో స్త్రీలకు కలిగే సర్వసౌఖ్యాలకు కారణం పురుషుడే అని స్త్రీలు తెలుసుకుని భర్తను గౌరవించాలి. ఇహపర సుఖాలలో పాతివ్రత్యానికి ఎంతో ప్రాధ్యాన్యత వుంది. భర్త బయటికి వెళ్ళి ఇంటికి వచ్చినపుడు అతని శ్రమ పోగొట్టేలా మాట్లాడాలి. ఇరుగుపొరుగు వారితో గొడవలు పెట్టుకుని వాటిద్వారా ఇంట్లో సుఖశాంతులు లేకుండా చేసుకోకూడదు. పురుషులు ఇంట్లో లేనపుడు పూలు పెట్టుకోవడం, అలంకారాలు చేసుకోవడం, తలవాకిట నిల్చోవడం స్త్రీలకు మంచిది కాదు. పరాయి పురుషులు ఎంత అందంగా వున్నా, ఎన్నెన్ని ధైర్యసాహసాలతో వున్నా వారి గురించి స్త్రీలు ఆలోచించకూడదు. మంత్రతంత్రాలతో భర్తల్ని వశపర్చుకోవడమనేది అబద్ధమని, భర్తల్ని వశపర్చుకోవాలంటే వారి పట్ల అమితమైన అనురాగం చూపించాలని చెప్తాడు.

'అధికము తెమ్మటంచును ననుదినంబు మగని పీడింప కనువున యిగురుబోడి కలుగునంతటి లోపల గడుపు కొనుచు తెలివితేటలు గలిగి వర్తించవలయును' అంటూ లేనిదానిని తీసుకురమ్మని భర్తలని పీడించడం

స్త్రీలకు మంచిది కాదని చెప్తూ కలిగిన దానితో తృప్తిపడుతూ స్త్రీలు తెలివితేటలు గలిగి నడుచుకోవాలని చెప్తాడు.

ఏ మనిషికీ కోపం మంచిదికాదు. ప్రత్యేకించి స్త్రీలకు కోపం వుండడం వల్ల దాని ప్రభావం ఇంటివారి మీద పడుతుంది. దానిద్వారా ప్రశాంతజీవనం కరువవుతుంది. కనుకే అన్ని పాపాలకు కోపం కారణం అని భావించి స్త్రీలు కోపాన్ని మానాలి. స్త్రీలు ఉద్యోగాలు చేస్తే తన కింది ఉద్యోగుల మీద కోపం ప్రదర్శించకూడదు. మంచితనంతో వారితో పని చేయించుకోవాలి. పనిమనుషులతో ఎలా మెలగాలో ఈ కింది పద్యంలో చెప్తాడు కవి.

**పనుల బనుచునపుడు పనివారలను మీరు / కసురుచుందురేని కాంతలార!**

**పనిని చేయరెపుడు బాగుగ, మఱి మీకు / క్రూరురాండ్రటంచు పేరువచ్చు**

పనిమనుషులతో జాగ్రత్తగా వ్యవహరించాలనే ఉద్బోధ పై పద్యంలో కనిపిస్తుంది. యజమానుల గురించి బయటి వారితో చెడుగా చెప్తారు. కనుక వారితో పనిచేయించుకునేటప్పుడు శాంతంగా వ్యవహరించాలి.

స్త్రీలకు శరీరాగ్యోగము చాలా అవసరం. ఇంట్లో అందరికి అన్నీ సమకూర్చే స్త్రీలు తమ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ తీసుకోవాలి. అందుకే 'అన్ని ధర్మంబులలో ముఖ్యమైన దరయ, తనదు దేహంబు కాపాడుకొనుటె' అని చెప్తాడు. క్రమం తప్పకుండా ప్రతీదినం స్నానం చేయాలని, విలువైన వస్త్రాలు లేకపోయినా శుభ్రంగా వున్న ముతకచీరలైనా ధరించాలనీ, కలుషజలాలు కాకుండా మంచినీరు త్రాగాలనీ, వేళతప్పి భోజనం చేయకూడదని, తలుపులు తీసు మంచిగాలిని ఇంట్లోకి ఆహ్వానించాలని, ఇంటి పరిసరాలలో మురికినీరు నిల్వచేరకుండా చూసుకోవాలనీ స్త్రీలకు బోధిస్తాడు కందుకూరి. 'లేనిపోని ఆచారములు పూని యొడలు చెడగొట్టుకొనకూడద'ని బోధిస్తాడు.

అంతేగాక 'కుడిచి కూర్చుండి యేమిట కొదవలేక వీరిని వారిని చేరిచి యూరివారి దోషముల నెన్నుచుండుట తుచ్ఛగుణము' అని స్త్రీలను హెచ్చరిస్తాడు. ఖాళీగా వున్నప్పుడు ఇంటి బాగోగుల గురించి ఆలోచించాలిగానీ పరుల చెంత చేరి చాడీలు చెప్పడం మంచిదికాదు. ఇతరుల సంపదలు చూసి అసూయ చెందకూడదు. ఇతరుల చేసిన చిన్న మేలును కూడా గొప్పగా భావించి ఇతరులకు తాము కూడా అలా చేయాలని స్త్రీలు భావించాలి. ఇంటిగుట్టును వీథిలో వారికి చెప్పకూడదు. దానివల్ల అన్ని పనులలోనూ ఆటంకాలు కలుగుతాయి.

'వీరికడ మాట గొనిపోయి వారికడను, వారికడ మాటలను దెచ్చి వీరికడను తెలుపబోకూడదు' అంటూ స్త్రీలకు మరో హెచ్చరిక చేస్తున్నాడు కవి. చెప్పుడుమాటలు చెప్పడంవల్ల నిందలపాలౌతారు. ఎక్కడైనా ఇద్దరు కూర్చుని మాట్లాడు కుంటుంటే వారి మాటలను చాటుగా వినకూడదు. దానివల్ల కలహాలు మొదలవుతాయి. ఇరుగుపొరుగువారితో కలిసి మెలసి వుండాలిగానీ పరుషవాక్యాలతో వారిని దూషించకూడదు. ఖ్యాతిగానీ, అపఖ్యాతిగానీ భర్తకు భార్యవల్లనే వచ్చే అవకాశముంది కనుక స్త్రీలు ఎప్పుడూ సన్మార్గంలో ప్రవర్తించి భర్తకూ, ఇంటికీ మంచిపేరు తీసుకురావాలి. చిన్నపిల్లలను దండించడంలో కూడా స్త్రీలకు విచక్షణ వుండాలని చెప్తాడు కవి. పిల్లలు అల్లరిచేస్తే బుజ్జగించి బుద్ధిచెప్పాలి గానీ 'నోటికి రాని తిట్లు తిట్టి గొడ్డుబాదిన కైవడి కొట్టెనేని తా మృగప్రాయ యౌట అందరికి తెలుపుగాని, బాలునకును బుద్ధి గరపలేదు' అని చెప్తున్నాడు. భార్యాభర్తల గొడవల వల్ల కూడా నలిగిపోయేది చిన్నపిల్లలే. కనుక వారి మధ్య ఎన్ని గొడవలు వున్నా వాటికి పిల్లల్ని బలిపశువులను చేయకుండా చిన్ననాటినుండి వారికి మంచిని బోధించి వారి భవితవ్యాన్ని తీర్చిదిద్దమని హెచ్చరిస్తున్నాడు.

**ముగింపు:**

బాలురకు, బాలికలకు చిన్ననాటినుండి మంచి విషయాలు నేర్పుతూ, వారిని భావిభారత పౌరులుగాతీర్చిదిద్దితే సమాజం అభివృద్ధి చెందుతుంది. భయంకరమైన బాల్యాన్ని గడిపే బాలబాలికలవల్ల సమాజం విచ్ఛిన్నం అవుతుంది. ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరగని బాలబాలికలు దేశాన్ని విచ్ఛిన్నం చేసే అవకాశాలకోసం ఎదురుచూస్తారు. కనుక వాళ్లని మంచిమార్గంలో నడిపించాలి. కందుకూరి రాసిన నీతిదీపిక, స్త్రీ నీతిదీపికలు వారు మంచిమార్గంలో నడవడానికి ఎంతో దోహదం చేస్తాయి.

**ఉపయుక్తగ్రంథాలు:**

1. నీతిదీపిక, కందుకూరి

2. స్త్రీ నీతిదీపిక, కందుకూరి,1950, హితకారిణి సమాజ ప్రచురణ, రాజమండ్రి.